క్లుప్తంగా

నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

సిద్దవటం : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ ఆసుపత్రి) అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరుగుతుందని ఆస్పత్రి అధికారి డాక్టర్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి హాజరవుతున్నారన్నారు. కావున కమిటీలో ఉన్న సభ్యులు అందరూ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఆలయంలో ఆకేపాటి పూజలు



ప్రత్యేక పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

పెనగలూరు : మండల కేంద్రం పరిధి కొత్తపల్లి గ్రామంలో కార్యసిద్ధి వినాయక స్వామి ఆలయంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తలమంచి ధనుంజయరెడ్డి, చంద్రభానురెడ్డిల ఆహ్వానం మేరకు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బిఎల్ నరసింహారెడ్డి, తలమంచి గిరీష్ రెడ్డి, ఆకుల చిన్న, సాతుపల్లి సుబ్బారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

రాజంపేట రూరల్ : ఇసుకపల్లె గ్రామానికి చెందిన టీటీడీ పీఆర్ఓ శివకుమార్‌రాజు తండ్రి మృతి చెందడంతో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చొప్పా ఎల్లారెడ్డి, దాసరి పెంచలయ్య, మధుబాబు, దండు గోపి, జీవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి



మొక్కను నాటుతున్న జడ్జి భార్గవి

నందలూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి నరసింహులు, సుబ్బరామయ్య, ఆనంద్, మోహన్, షేక్ అనుదీప్, నూర్, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

రామాపురం : మండలంలోని చిట్లూరు గ్రామం చెరువు ముందరపల్లెలో గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడంతో గ్రామస్తులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి గ్రామానికి కొత్తగా పైప్‌లైన్‌ను శుక్రవారం ఏర్పాటు చేయించారు.

వైభవంగా గంధ మహోత్సవం



గంధం తీసుకొస్తున్న ముస్లిం పెద్దలు

సిద్దవటం : మండల కేంద్రం పరిధిలోని ఎగువపేటలో చారిత్రాత్మకమైన ఫత్తుమియ్యా మసీదులో మిలాద్ – ఉన్ – నబి పురస్కరించుకొని శుక్రవారం గంధ మహోత్సవాన్ని నిర్వహించామని ముత్తవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గంధంను ఆసారే షరీఫ్ ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా మసీదుకు చేరిందన్నారు. అక్కడ గంధంను పాతేహా నిర్వహించామన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

సిద్దవటం : సంటిగారిపల్లె గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని సిద్దవటం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.లక్ష్మీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించామన్నారు. గ్రామంలోని 34 పశువులకు గర్భ నిర్ధారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 28 దూడలకు నట్టల నివారణ మందులు, 129 సన్న జీవాలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ శ్వేత, డాక్టర్ శివశంకర్, సిబ్బంది భారతి, గంగోత్రి, మహబూబ్‌బాషా, నరసింహులు, పుల్లయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

వాహనాలు ఢీ, ముగ్గురికి గాయాలు

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన చోటు చేసుకొంది. పోలీసుల వివరాల మేరకు తిరుపతి జిల్లా రంగన్నగారిగడ్డకు చెందిన శ్రీకాంత్ ద్విచక్రవాహనంలో రాయచోటి వైపు నుంచి పీలేరు వైపు వెళుతుండగా మండలంలోని పెద్దబిడికి చెందిన శ్రీనునాయక్ ద్విచక్రవాహనంలో కలకడ నుంచి పెద్దబిడికి వస్తుండగా మార్గమధ్యలోని గుట్టపల్లె బస్టాప్ సమీపంలో ఢీ కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ శ్రీకాంత్‌తో పాటు మరో వ్యక్తిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్నో ఆశలు పెట్టుకున్నాం



ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లపై వివక్ష చూపించడం సరైన విధానం కాదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో సీట్లు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. నా చిన్నతనం నుంచి డాక్టర్ అవ్వాలన్నది నా కోరిక. అదే విధంగానే కష్టపడి చదువుతున్నాను. మదనపల్లె, పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ వస్తోందంటే సంతోషపడ్డాం. సీట్ల కేటాయించకపోవడంతో విద్యార్థులకు అన్యాయం జరిగింది. ఈ నిర్ణయంతో నాలాంటి వందలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడటమే కాక ఎడ్యుకేషనల్ ఇయర్‌ను కోల్పోతాం.

– మారోతు తిరుమలేశ్, రాజంపేట



ప్రైవేట్‌పరం చేయాలనే ఆలోచన తప్పు



విద్య, వైద్య రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ రంగంగా మార్చే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. ఇలాంటి ఆలోచన చేయడం చాలా దుర్మార్గం. ఇలాంటి నిర్ణయాల వలన పేద విద్యార్థులు పూర్తిగా ఉన్నత విద్యకు దూరం అవుతారు. తద్వారా పెత్తందారి తనం రాజ్యమేలుతుంది. మెడికల్ సీట్లు పెంచి ప్రజలకు మంచి ఆరోగ్యం అందించాల్సిన ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకోవడం దారుణం. ఎన్ఎంసీ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల అనుమతులు రద్దు చేయమని చెప్పడం. ఈ నిర్ణయాలను పూర్తిగా వెనక్కు తీసుకోవాలి. లేదంటే విద్యార్థుల నుంచే వ్యతిరేకత వస్తుంది.

– సర్వేపల్లి నరసింహ, ఎస్ఎఫ్ఐ అన్నమయ్యజిల్లా కార్యదర్శి

వేడుకల నడుమ గంగ ఒడికి గణనాథుడు

అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన ఉత్సవ కమిటీలు



నందలూరు: వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి



పెనగలూరు: కల్యాణ క్రతువును జరుపుతున్న వేదపండితులు

సంబేపల్లె : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో కొలువైన గణనాథులను శుక్రవారం నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఉదయం నుంచి ఆయా గ్రామాలలోని ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణనాథులని విగ్రహాలను వేడుకల నడుమ ఊరేగించారు. ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు కల్పించారు.

సుండుపల్లె : మండల కేంద్రంలోని వినాయక నగర్‌లో మేస్త్రీ రమణ ఆధ్వర్యంలో వినాయక స్వామి విగ్రహం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : జిల్లాకేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి ప్రతిమ వద్ద మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన ముగ్గురితోపాటు మరో మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలానే జగదాంబ సెంటర్, పాత రాయచోటి, చెన్నముక్కపల్లె, గున్నికుంట్ల రోడ్డులతో పాటు గ్రామీణ ప్రాంతాలలో కొలువైన గణనాథుడిని ప్రతిమలను నిమజ్జనం చేశారు. చెన్నముక్కపల్లె శివాలయం ఆవరణలో భక్తులకు దాతలు భోజనం అందించారు.

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని వినాయకుడి మండపం వద్ద ఎంపీపీ సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మద్దిరేవుల కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, వైస్ ఎంపీపీ సుబ్బరాయుడు, సర్పంచ్‌లు సిద్దక నాగిరెడ్డి, జనార్దన్ రెడ్డి, ఉప సర్పంచ్‌లు రాజారెడ్డి, సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామ్మోహన్ శెట్టి, శ్రీనివాసులు, రవి ఆచారి, అశోక్ రెడ్డి, నాగేంద్రబాబు, సభాపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలానే మండలంలోని శంకర్ నాయుడు వీధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను నిమజ్జనానికి తరలించారు.

నందలూరు : వినాయకుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలకు ఉండాలని అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి అన్నారు. శుక్రవారం నందలూరు గ్రామ పంచాయతీలోని దిగువ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సౌమ్యనాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, సిద్దవరం గోపిరెడ్డి, భూమన శివశంకర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, గంపా సుధాకర్, గీతాల నరసింహారెడ్డి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బరాజు, దండుగోపి, ముమ్మడిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని కుమ్మరివీధి, వెలుగుపల్లె, కమ్మపాలెం ఎస్సీ కాలనీ గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహాలకు శుక్రవారం వైభవంగా నిమజ్జనం కార్యాక్రమాన్ని నిర్వహించారు. విగ్రహాలను పూలతో అలంకరించిన ట్రాక్టర్‌లో ఎక్కించి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా వినాయక స్వామి కల్యాణం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో వినాయక స్వామి ఆలయంలో సిద్ధి బుద్ధిల సమేత వినాయకుడి కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. తలమంచి గిరీష్ రెడ్డి, మాధవీరెడ్డి దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. తిరుమల క్షేత్రంలో పనిచేస్తున్న వేదపండితులు కల్యాణ క్రతువును జరిపించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సర్కిల్ నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ, విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేశారు. తలమంచి తిరుపాల్ రెడ్డి జ్ఞాపకార్థం ధనుంజయ్ రెడ్డి, చంద్రభానురెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, గిరీష్ రెడ్డిలు కల్యాణాన్ని జరిపామని నిర్వాహకులు తెలియజేశారు. వందలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించారు. విచ్చేసిన భక్తులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు.



లక్కిరెడ్డిపల్లె: వినాయకుడికి పూజలు చేస్తున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి



రాయచోటి టౌన్: పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



పెనగలూరు: వినాయకుడి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



సుండుపల్లె: అన్నదానం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు జాతీయ సేవా పథకం – 1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. పౌష్టికాహార లోపం ఉన్న విద్యార్థులను గుర్తించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎత్తుకు తగ్గ బరువు, పౌష్టికాహారం, ఆకుకూరలు, పండ్లు మొదలగునవి తినడం వలన అనీమియా వ్యాధిని సమూలకంగా ఎదుర్కోవచ్చని ఎన్ఎస్ఎస్ పీఓ నాగనవీన్‌కుమార్ సూచించారు. వైద్య సిబ్బంది బేబి, నాగరాణి, భారతి, ల్యాబ్ అసిస్టెంట్ ద్వారా ఐరన్ మాత్రలు, టానిక్‌లను విద్యార్థులకు అందజేశారు.

విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెంపొందించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గాలివీడు : పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంపొందించాలని ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నూలివీడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అందులో భాగంగా సీనియర్స్ విభాగంలో మీనాక్షి, లక్ష్మి, సురేష్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలువగా, జూనియర్స్ విభాగంలో కార్తీక్, లావణ్య, ఖుబ్రా వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలు విద్యార్థుల్లో ఆలోచన శక్తి, సృజనాత్మక శక్తి, తార్కిక ఆలోచన శక్తిని పెంపొందిస్తాయన్నారు.

సబ్ కలెక్టర్ దృష్టికి కేజీబీవీ సమస్యలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఓబులవారిపల్లె : కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాల విద్యార్థుల సమస్యలను సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం కస్తూర్బా గాంధీ పాఠశాలను సబ్ కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు డార్మెంటరీలు సరిపోవడం లేదని, అధ్యాపకులు తక్కువగా ఉన్నారని, లేడీ డాక్టర్‌ను క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

సిద్దవటం : మండలంలోని లింగంపల్లె గ్రామంలో శుక్రవారం గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించామని బద్వేల్ ఏడీఏ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పొలంబడి ప్రాధాన్యతను వివరించారు. 2 ఎకరాల అధ్యయన క్షేత్రంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. సూడొమోనాస్, క్లోరోఫైరిపాస్ వాడకంపై అవగాహన కల్పించామన్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించిన రైతులకు స్కోప్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. గట్ల మీద చెండుమల్లి, ఆముదము, కంది పంటలను సాగుచేసిన యడల అదనపు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సహాయకులు శివఫణీంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నక్క, సింగరయ్య, ఐసీఆర్‌పీలు సుమలత, లక్ష్మీదేవి, పద్మావతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విధిగా హిందీ భాషను నేర్చుకోవాలి



రాజంపేట టౌన్: పోటీల్లో గెలుపొంది బహుమతులు పొందిన విద్యార్థులు




పుల్లంపేట: హిందీ రచయిత రాజేంద్ర సింహ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రాజంపేట టౌన్ : విద్యార్థులు హిందీ భాషను విధిగా నేర్చుకోవాలని బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి తెలిపారు. ఆ పాఠశాలలో శుక్రవారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. ప్రపంచంలోనే ఎక్కువగా మాట్లాడే భాషలలో హిందీ రెండవదన్నారు. హిందీ భాషను లాంగ్వేజ్ ఆఫ్ యూనిటీ అని కూడా అంటారని చెప్పారు. అనంతరం ఉత్తమ హిందీ ఉపాధ్యాయ అవార్డును పొందిన ఎస్వీ.రామరాజును సన్మానించారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో గెలపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీఎండీ.షఫీ, ఎస్.శారద, డి.శ్రీలత, పి.జనార్దన్, దండు సుబ్బరాయుడు, ఎస్వీ.రామరాజు. ఈశ్వర్‌నాయక్, శేషగిరి, దార్ల శ్రీనివాసులు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండలంలోని టి.కమ్మపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సత్తార్ హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు హిందీ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. హిందీ భాష అభివృద్ధికి కృషి చేసిన దివంగత ప్రముఖ హిందీ రచయిత రాజేంద్ర సింహ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.రమణారెడ్డి, ఉపాధ్యాయులు నరసింహులు, రమణయ్య, గిరిధర్, శేషాద్రి, షామీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి మున్సిపల్ చైర్మన్‌కు పితృవియోగం



ఇలియాస్ బాషా (ఫైల్)

రాయచోటి : రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా తండ్రి ఇలియాస్ బాషా (67) మృతి చెందారు. ఆయన అనారోగ్యంతో కొద్దిరోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఇలియాస్ బాషా మృతిపట్ల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఫోన్ ద్వారా ఫయాజ్ బాషాను పరామర్శించి సంతాపం తెలిపారు. అలానే ఇలియాస్ బాషా భౌతికకాయానికి పలువురు నివాళి అర్పించారు. టీటీడీ పాలకవర్గం మాజీ సభ్యులు ప్రసాద్ బాబు, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ విభాగం మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు దశరథరామిరెడ్డి, ఫయాజుర్ రెహ్మాన్, కౌన్సిలర్లు అన్నా సలీమ్, ఫయాజ్ అహ్మద్, షబ్బీర్ అహ్మద్, జాకీర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహ్మాన్ తదితరులు నివాళులర్పించారు.

చిరస్మరణీయుడు సీతారాం ఏచూరి



చిట్వేలి: ఏచూరికి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మండల సీఐటీయూ నాయకులు



ఓబులవారిపల్లె: సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏపీఎండీసీ కార్మిక సంఘాలు

చిట్వేలి : సీతారం ఏచూరి చిరస్మరణీయుడని, ఆయన మృతి సీపీఎం పార్టీకే కాకుండా మొత్తం వామపక్ష, లౌకిక ప్రజాస్వామ్య ఉద్యమానికి తీరని లోటని సీఐటీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఐటీయూ ఏపీఎండీసీ పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ వెంకటేష్, పందికాళ్ల మణి, సుజాత, సుధామణి, గురవయ్య, సుధాకర్, సిద్దు, మల్లి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమంలో ఏచూరి చెరగని ముద్ర

ఓబులవారిపల్లె : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరనిలోటని, ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేశారని ఏపీఎండీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మురళీ అన్నారు. శుక్రవారం మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణం నందు ఏచూరి సీతారాం మృతిపట్ల ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగాధర్, ఎంప్లాయిస్ కృష్ణ చైతన్య, సుబ్రమణ్యం, బాలకృష్ణ, విజయ్ కుమార్, బాబు, వినోద్, మణికంఠ, విజయ్ కృష్ణ, భాను ప్రకాష్, వాసు, సుబ్రమణ్యం, అనిల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్మిక, కర్షక పోరాటాల సారథిగా ఎన్నో విజయాలు సాధించారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడి మృతి చెందడం పేద బడుగు, బలహీన వర్గాలు, కార్మిక లోకానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పుల్లయ్య, ప్రసాద్, రమాదేవి, రాధాకుమారి, దుర్గ, ఎం.ప్రసాద్, రాజశేఖర్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : సీపీఎం జాతీయ నాయకుడు దివంగత సీతారాం ఏచూరి చిత్రపటానికి శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచి పోరాటపటిమను అలవరుచుకొని పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఏచూరి మృతి తీరనిలోటని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిట్వేలి రవికుమార్, శంకరమ్మ, పి.మహేష్, శివరామకృష్ణదేవర, రమణ, ప్రసాద్, ఓబయ్య, రాముడు, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహార విలువలు తెలుసుకోవాలి

సిద్దవటం: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య తెలిపారు. మండలంలోని నేకనాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రామాపురం : మహిళలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గువ్వలచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవం నిర్వహించారు. మాట్లాడుతూ పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు నూతన కమిటీ

రాజంపేట రూరల్ : రాజంపేట ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ తాలూకా అధ్యక్షుడిగా ఐసీ వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా జవ్వాజి మల్లికార్జున, అప్పారావు, ఎ.ఈశ్వరయ్య, గౌరవ సలహాదారులుగా కొత్తపల్లి గణేష్, మలిశెట్టి సుబ్బనరసింహులు, నాగరాజు ఆచారి, అధ్యక్షులుగా బచోటి భాస్కర్, ఉపాధ్యక్షులుగా ఎం.ఓబులేసు, శివయ్యనాయుడు, చామంచి హరి, కె.రమణ, ప్రధాన కార్యదర్శిగా మందా శివయ్య, కోశాధికారిగా బాలిపోగు సునీల్, కార్యదర్శులుగా యూ.కళ్యాణ్, ఎం.శ్రీహరి, ఎస్.నరసింహ, బి.నాగేంద్రప్రసాద్, ఈ.శివయ్య, సహాయ కార్యదర్శులుగా ప్రశాంత్, చామంచి వెంకటసుబ్బయ్య, సి.నరసింహ, పి.దుర్గయ్య, కార్యవర్గ సభ్యులుగా జీవీపీఆర్‌కె.రాయులు, పి.దివాకర్, టి.చంద్రశేఖర్, కె.మధుసూదన్, సి.వెంకటేశ్వరరాజు, కె.సుధాకర్, శివ, ఎస్.కృష్ణయ్య, విజయ్‌కల్యాణ్‌లను ఎన్నుకున్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

రామాపురం : మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలలో 12, 13 తేదీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నీలకంఠ్రావుపేటలో క్రీడా పోటీలు నిర్వహించారు. గెలిచిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేసినట్టు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుజాత, పీడీ నరేంద్రకుమార్‌రెడ్డిలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, మహమ్మద్ హిలాల్, పీడీలు నురేంద్రకుమార్‌రెడ్డి, రెడ్డయ్య, ఆంజనేయులు, జాహిద్‌అలీ, కోచ్, మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

సుండుపల్లె : ఉమ్మడి కడప జిల్లా అండర్–19 బాలికల జట్టుకు సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. శుక్రవారం కడప జిల్లా గండి గురుకుల పాఠశాలలో ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 విభాగంలో జిల్లాస్థాయి జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుండుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.పల్లవి, ఎం.జాహ్నవి, ఎస్.అహనలు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం పొందారు. విద్యార్థుల ఎంపికపై ప్రధానోపాధ్యాయులు జయన్న, పీడీ రవీంద్రరాజు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నందలూరు : స్థానిక అరవపల్లి జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా నందలూరు హెచ్‌ఎం శ్రీనివాసులు, స్కూల్ గేమ్స్ మండల కో–ఆర్డినేటర్ కృష్ణయ్య, అసిస్టెంట్ హెచ్‌ఎం షేక్ రౌఫ్ బాషాలు మాట్లాడుతూ మండలస్థాయి క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి రాజంపేట డివిజన్ పరిధిలో త్వరలో ఏడు విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఫిజికల్ డైరెక్టర్స్ గౌరీ, సరిత, సుస్మిత, విశ్వనాథ్, జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన



మంగళంపల్లిలోని భూములను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె : రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి ఆదేశాల మేర తహసీల్దార్ పీర్ మున్నీ శుక్రవారం మంగళంపల్లె రెవెన్యూ పరిధిలోని భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మంగళంపల్లె ఎస్టీ కాలనీకి చెందిన 20 కుటుంబాలకు ప్రభుత్వం భూములు ఇచ్చిందని, ఆ భూములు ఆక్రమణకు గురయ్యాయని రాజంపేట సబ్ కలెక్టర్‌కు బాధితులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పండుగోల మణి, జ్యోతి చిన్నయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దార్ల రాజశేఖర్, మండల అధ్యక్షురాలు చింతలపూడి నాగమ్మ, డీహెచ్‌పీఎస్ నాయకుడు మోడి శివయ్య, బిఎంకెయు రైల్వేకోడూరు నియోజకవర్గ నాయకులు రేవూరి కిట్టయ్య, తిప్పన ప్రసాద్, గుడిసె జయరాం, రమణయ్య పాల్గొన్నారు.